# మహిళల్లో రక్తహీనతను నిర్మూలించాలి

**- రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ సిఇఒ విజయ్‌కుమార్**
**- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

మహిళల్లో రక్తహీనతను సమూలంగా నిర్మూలించేందుకు ప్రత్యేక దృష్టి సారించేలా కలెక్టర్లు కృషి చేయాలని రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ సిఇఒ విజయ్ కుమార్ సూచించారు. గురువారం అమరావతి నుంచి అనీమియా, స్పందన, పాఠశాల మౌలిక సదుపాయాల అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనీమియాతో బాధపడుతున్న మహిళలపై ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రణాళిక రూపొందించుకొని తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టాలన్నారు. పిల్లలు స్కూల్ డ్రాప్ అవుట్స్ కాకుండా చేరుకోవాలని తెలిపారు. వివిధ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం వల్ల కూడా అనీమియాను పారదోలే అవకాశం ఉందని తెలిపారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. స్పందన అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని, స్పందన అర్జీలకు సరైన పద్ధతిలో సమాధానం ఇవ్వాలని సూచించారు. అనంతరం పి.కోటేశ్వరరావు మాట్లాడారు. జిల్లాలో అంగన్వాడీ కేంద్రంలో ఉన్న ప్రతి ఒక్కరి పేరు, బరువుతో కూడిన వివరాలతో నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. కేంద్రాల్లో నాణ్యమైన ఆహారం ఇవ్వడం ద్వారా వారిలో మార్పు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అనీమియా అంశంపై తీసుకున్న చర్యలను పర్యవేక్షణ చేసేందుకు ప్రత్యేకంగా నోడల్ అధికారిగా డిఆర్‌డిఎ పీడీ వెంకట సుబ్బయ్యను నియమిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా 10-19 ఏళ్ల చిన్నారులు ఎంతమంది అనీమియాతో బాధపడుతున్నారని, వారిని మూడు విభాగాలుగా విభజించి, వారిలో ఉన్న లోపాన్ని నివారించడానికి ప్రతి గురువారం రెగ్యులర్‌గా ఫోలిక్ యాసిడ్ టాబ్‌లెట్స్ ఇస్తున్నామని డిఎంహెచ్‌ఒ రామ గిడ్డయ్య కలెక్టర్‌కు వివరించారు. ఐసిడిఎస్ పీడీ కుమారి, డిఇఒ రంగా రెడ్డి, ఎస్ఎస్ఎ పిఒ వేణుగోపాల్, బీసీ, ఎస్సీ, మైనారిటీ వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

# షరతులతో 'సున్నా'

**- ఈ క్రాప్‌లోని పంటకు రుణం తీసుకుంటేనే అర్హత - అర్హత కోల్పోయిన 90 శాతం మంది రైతులు**

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

**ప్రభుత్వం రైతులను అందించే సున్నా వడ్డీ పథకానికి షరతులు తీవ్రం చేయడంతో రైతులకు సున్నానే మిగులుతోంది. ఈ క్రాప్‌లో నమోదు చేసిన పంటను సాగు చేసి ఆ పంటకే రుణం తీసుకుంటేనే ఈ పథకానికి అర్హత అంటూ నిబంధన తీసుకురావడంతో 90 శాతం మంది రైతులు ఆ పథకానికి అర్హత కోల్పోయారు.....**

ఉమ్మడి జిల్లాలో 54 మండలాల్లో దాదాపు ఆరు లక్షల మంది రైతులు పంట సాగుపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరిలో దాదాపు నాలుగు లక్షల మంది రైతులు పంట సాగు కోసం బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. జిల్లాలో దాదాపు నాలుగు లక్షల మంది రైతులు ఖరీఫ్‌లో తీసుకున్న పంట రుణాలకు సంబంధించి రూ.3.62 కోట్లు, రబీలో తీసుకున్న పంట రుణాలకు సంబంధించి రూ.1.70 కోట్లు బ్యాంకులకు వడ్డీ కింద చెల్లించాల్సి ఉంది. దాదాపు ఎనిమిది నెలల నిరీక్షణ తర్వాత నింపాదిగా 2020 రబీతోపాటు 2021 ఖరీఫ్ సీజన్‌లకు సంబంధించి రైతులు తీసుకున్న పంట రుణాలకుగాను వారు చెల్లించిన వడ్డీని గత వారంలో ముఖ్యమంత్రి జగన రైతుల ఖాతాలకు జమ చేశారు. కర్నూలు జిల్లాలో 10,1,093 మంది రైతుల ఖాతాలకు రూ.22.44 కోట్లను జమ చేశారు. నంద్యాల జిల్లాలో 81,294 మంది రైతులకు రూ.16.24 కోట్లను జమ చేశారు. మొత్తం రెండు జిల్లాలకు కలిపి రూ.38.68 కోట్లను జమ చేశారు. సున్నా వడ్డీ పథకాన్ని విడుదల చేయడానికి ముందుగా రైతులు బ్యాంకులకు రుణం మార్చిలోపు చెల్లించాలని, ఈక్రాప్ నమోదులో ఏ పంటను సాగు చేసి ఉంటారో దానికే బ్యాంకులో రుణం తీసుకుని ఉండాలని షరతు విధించింది. ఈ నిబంధనతో దాదాపు 90 శాతం రైతులు అర్హత కోల్పోవాల్సి వచ్చింది. వాస్తవంగా రైతు పొలంలో ఏ పంట సాగు చేసినా రుణం తీసుకుని ఉంటే వడ్డీని బ్యాంకులకు నేరుగా జమ చేయాల్సి ఉంది. ఈ పరిస్థితిని తారుమారు చేసినందు వల్ల సున్నా వడ్డీ పథకం రైతులకు ఏ మాత్రం ప్రయోజనకరంగా లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

**ఈక్రాప్‌తో లింక్...**

ఇప్పటి దాకా రైతులు బ్యాంకుల్లో పంట సాగు కోసం రుణం తీసుకున్నారు. ఈ రుణాలకు సంబంధించి ప్రభుత్వం ఏడు శాతం వడ్డీ చెల్లించేది. తాజాగా లబ్ధిదారుల్లో కోత పెట్టేందుకు కొత్త మార్గాలను అమలు చేసేందుకు సిద్ధమైంది. బ్యాంకుల్లో రైతులు ఏ పంట సాగు కోసం రుణం తీసుకున్నారో ఆ పంటను మాత్రమే తప్పనిసరిగా సాగు చేయాలని, ఈ సమాచారాన్ని ఆర్‌బీకే కేంద్రాల్లోని అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం రైతులు ఏదో ఒక పంట సాగు చేస్తున్నట్లు బ్యాంకులకు సమాచారం అందించి రుణం తీసుకుంటున్నారు. ఇకపై ఆ విధంగా చేయడం కుదరదు. ఆర్‌బికెల ద్వారా ఈక్రాప్ బుకింగ్ సమర్థంగా అమలు చేసి అందుకు అనుగుణంగా రుణాలు ఇచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీని వల్ల రైతులకు పంట రుణం పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉంది.

# నట్టేట ముంచిన నకిలీ పత్తి విత్తనాలు

**- రూ.1.50 లక్షలు పెట్టుబడి నేలపాలు - ఓ రైతు ఆవేదన**

**ప్రజాశక్తి - పత్తికొండ**

నకిలీ పత్తి విత్తనాలతో రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టి నేల పాలయిందని ఓ రైతు కన్నీరు మున్నీరయ్యారు. రైతు తెలిపిన వివరాల మేరకు... పత్తికొండ మండలం చిన్నహుల్తి గ్రామానికి చెందిన రైతు అల్లి సాహెబ్ 5 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. పత్తికొండలోని వెంకట్ సాయి ఫెర్టిలైజర్ షాపులో నందిని సీడ్స్ పత్తి విత్తనాలు కొనుగోలు చేశారు. పంట వేసి ఐదు నెలలు కావస్తున్నా పంట ఏపుగా పెరిగింది. కాయలు, పూత, పింజ లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అప్పు చేసి పంట సాగు చేశానని, పత్తి పంట చేతికి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయాయని రైతు అల్లిసాహెబ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫర్టిలైజర్ షాపు యాజమాన్యం నకిలీ విత్తనాలు ఇచ్చి తనను మోసం చేశారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఫర్టిలైజర్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

ఫర్టిలైజర్ దుకాణం వద్ద మాట్లాడుతున్న రైతు

ఎద్దు మృతి చెందడంతో ఆందోళన చెందుతున్న రైతు

# విజృంభిస్తున్న లంపీ స్కిన్

**- బెళగల్‌లో 9కి చేరిన మూగజీవాలు**
**- రైతుల ఆందోళన**

**ప్రజాశక్తి - సిబెళగల్**

మండలంలో లంపీ స్కిన్ వ్యాధి విజృంభిస్తోంది. పశు వైద్యాధికారులు తగిన వైద్యం అందిస్తున్నప్పటికీ మూగజీవాలు లంపీ స్కిన్ బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. వ్యాధి నయం అవుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తిమ్మందొడ్డి గ్రామంలో రంగన్న, చింతమానుపల్లెలో పులి రంగడు, పోలకల్‌లో బాలరాజు, బల్లి కాలాబు, సురేష్, బురాన్‌దొడ్డిలో మల్లేష్ నాయుడు, బ్రాహ్మణదొడ్డిలో బంగారు రాజుకు చెందిన పాడి పశువులు ఇప్పటికే మృతి చెందాయి. గురువారం బెళగల్‌కు చెందిన చాకలి పెద్దయ్య ఎద్దును పశు వైద్యశాలకు తీసుకొస్తే వైద్యం అందించాక కాసేపటికే మృతి చెందింది. మండలంలో మృతి చెందిన జీవాల సంఖ్య 9కి చేరింది. సరైన నివారణ అందడం లేదని, నివారణకు తగిన మందులను గుర్తించలేదని, ప్రభుత్వాల లోపం అడుగడుగునా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

# రీ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

**- కలెక్టర్ కోటేశ్వరరావు - రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్ష**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

భూముల రీసర్వేను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వర రావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రెవెన్యూ, సర్వే అధికారులతో జెసి ఎస్.రామసుందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో భూ హక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు, ప్రాథమికంగా భూ కొలతలు, తప్పులను సవరించేందుకు గ్రామ సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి, సిబ్బంది తహశీల్దార్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో ప్రతి పొలాన్ని రీ సర్వే చేస్తారని తెలిపారు. అవసరమైన రికార్డులను సేకరించే నిమిత్తం పొలాన్ని రికార్డులతో సరి చూసుకొని ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ మీద అందరికీ అర్థమయ్యే విధంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. ఇప్పటి వరకు 66 గ్రామాల్లో పూర్తి చేశారని, పెండింగ్‌లో ఉన్న రీసర్వే పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో భూహక్కుదారులకు జగనన్న భూహక్కు - భూరక్ష పత్రాలు రాగానే వెంటనే పంపిణీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జెసి మాట్లాడారు. రీ సర్వేలో తలెత్తిన సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో భాగంగా తగిన నివేదికలు టీమ్‌ల వారీగా రూపొందించి రోజూ చేసే కార్యక్రమాలు వివరించి, వాటిని జిల్లా అధికారులు రూపొందించిన గూగుల్ వర్క్ షీట్‌లో ఎప్పటికప్పుడు రెవెన్యూ వారి ద్వారా అందజేయాలని తెలిపారు. కర్నూలు, పత్తికొండ ఆర్‌డిఒలు హరి ప్రసాద్, మోహన్ దాస్ పాల్గొన్నారు.

**నిర్దేశిత గడువు లోపు సమాచారం ఇవ్వండి**

సమాచార హక్కు చట్టం నిబంధనలను అనుసరించి నిర్దేశిత గడువులోపు సమాచారం ఇవ్వాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ (సాధారణ పరిపాలన) ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. సమాచార హక్కు చట్టం అమలుపై కలెక్టరేట్ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాచారాన్ని కోరుతూ వచ్చిన దరఖాస్తులపై సకాలంలో స్పందించి, చట్ట ప్రకారం అర్జీదారు కోరిన సమాచారాన్ని అందించాలని సూచించారు. దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలని తెలిపారు. సంబంధిత రిజిస్టర్‌లను కచ్చితంగా నిర్వహించాలని, పీరియాడికల్‌గా పంపే నివేదికలను క్రమం తప్పకుండా పంపాలని సూచించారు. సమాచార హక్కు చట్టం నిబంధనల గురించి వివరించారు. అంతకుముందు కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌ఛార్జ్ డిఆర్‌ఒ మల్లికార్జున, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

## ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

**- డిపిఎం చంద్రశేఖర్**

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న డిపిఎం

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**

ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని డిపిఎం చంద్రశేఖర్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పంట పొలాలను ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ గురువారం కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ మోడల్ ప్లేట్‌ను, కృష్ణవేణి వేసిన కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి రికార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పండించిన ఆహారం ద్వారానే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులను వాడటం వల్ల నేల కాలుష్యమవుతుందని చెప్పారు. రైతులు పండించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు కలుషితమై ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ మురళీ మోహన్, పిఆర్‌పి రాంజనేయులు పాల్గొన్నారు.

## సిల్వర్ జూబ్లీలో యూత్ ఫెస్ట్

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టర్**

సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా గురువారం కళాశాలలో లిటరరీ, కల్చరల్ యూత్ ఫెస్ట్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సుబ్రమణ్యం కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ సాయి గోపాల్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సిల్వర్ జూబ్లీ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. కళాశాల 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 9 ప్రభుత్వ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

యూత్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న వక్తలు

# పట్టుదల, క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలి

**- ఇండస్ పాఠశాల అధినేత రాజశేఖర్**
**- ఎస్‌జిఎఫ్ ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికకు విశేష స్పందన**

**ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్**

పాఠశాల స్థాయి నుంచే చిన్నారులు క్రమశిక్షణతో క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రీడల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఇండస్ పాఠశాలల అధినేత కెఎన్‌వి.రాజశేఖర్ తెలిపారు. గురువారం ఇండస్ పాఠశాలలో జిల్లా ఎస్‌జిఎఫ్ అండర్-14, 17 బాలబాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరయి మాట్లాడారు. విద్యార్థులు రోజూ నచ్చిన క్రీడలో సాధన చేసి క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలని కోరారు. నేటి పోటీ ప్రపంచంలో చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే క్రీడా ప్రశంసా పత్రాలతో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలను పొందవచ్చని తెలిపారు. జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ... విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి ఎంపిక పోటీల్లో పాల్గొనాలని కోరారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎంపికకు వచ్చిన 500 మంది క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేసినందుకు ఇండస్ పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం, జిల్లా ఎస్‌జిఎఫ్ సంఘాల తరపున ఇండస్ పాఠశాల కరస్పాండెంట్ కెఎన్‌వి.రాజశేఖర్‌ను, పాఠశాల సిఇఒ విల్సన్, ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డిని సన్మానించారు. వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి రవికుమార్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ట్రెజరర్ శ్రీనివాసులు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు సంజప్ప, ఎమ్ఎమ్‌డి.బాష, నరసింహ రాజు, వెంకటరాముడు, మాధవి లత, దోర్తి, కిషోర్, మాలిక్, రాజశేఖర్, కృష్ణ, వెంకటేష్, పాల్ విజయకుమార్, ఈరన్న, మల్లి పాల్గొన్నారు.

రాజశేఖర్‌ను సన్మానిస్తున్న ఆయా సంఘాల సభ్యులు

ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

## ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపుదాం

**- మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత**

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ఇంటికి సాగనంపుదామని పాణ్యం టిడిపి ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కల్లూరు అర్బన్ 19వ వార్డ్ సోమిశెట్టి నగర్‌లోని జెమ్మి చెట్టు, వాటర్ ట్యాంక్ దగ్గర నుండి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఇంటింటికీ తిరిగి వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు ఇంఛార్జి, తెలుగు యువత రాష్ట ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాలి

**- అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి**
**- సిపిఐ, ఎఐకెఎస్**

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

అధిక వర్షాలతో పంటలను నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని, నకిలీ విత్తనాల దందాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో రైతు రక్షణ కాలినడక యాత్ర గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 16 నుంచి 20 వరకు జరిగే రైతు రక్షణ కాలినడక యాత్రను జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ నగర సహాయ కార్యదర్శి సి.మహేష్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసులు, కారుమంచి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఈ.శ్రీరాములు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్, రంగస్వామి, నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, మునిస్వామి, ఎఐటియుసి నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఎపి ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి వి.నాగరాజు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి షూటింగ్ బాల్‌లో రాణించండి

**- జిల్లా క్రీడా శాఖ సిఇఒ రమణ**

**ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్**

ఈనెల 29 నుంచి తెలంగాణ రాష్ట్రం ఆదిలాబాద్‌లో జరగనున్న 41వ జాతీయస్థాయి అండర్-19 బాలబాలికల షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించాలని జిల్లా క్రీడా శాఖ సిఇఒ పివి.రమణ ఆకాంక్షించారు. గురువారం కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ఒలింపిక్ సంఘం సభ్యులు పి.విజయకుమార్ మాట్లాడారు. జాతీయ స్థాయిలో సత్తా చాటి కర్నూలుకు కీర్తి ప్రతిష్టలు తీసుకు రావాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ అథారిటీ ప్రధాన శిక్షకులు నటరాజారావు, ఎంఎన్‌వి.రాజు, జిల్లా త్రోబాల్ సంఘం కార్యదర్శి కిరణ్ కుమార్, షూటింగ్ బాల్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగశేషు, నాగరాజు, నాగేశ్వరి, మాధవి పాల్గొన్నారు.

## అద్వితికి ఆర్చరీ కిట్ అందజేత

**ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్**

గురుకుల పాఠశాలలో 1వ తరగతి చదువుతూ ఆర్చరీలో రాణిస్తున్న అద్వితికి వైసిపి నందికొట్కూరు నాయకులు, ఆయుష్మాన్ నర్సింగ్ కళాశాల సెక్రటరీ ఎక్కలదేవి చంద్రమౌళి ఆర్చరీ కిట్టును అందజేశారు. గురువారం ఆయన మాట్లాడారు. అద్వితికి ఆర్చరీలో రాణిస్తూ జాతీయ స్థాయికి ఎంపిక కాకడం గర్వకారణమని తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనిబరచాలని ఆకాంక్షించారు. ఆమె తల్లిదండ్రులు భరత్, శిరీషను అభినందించారు. క్రీడలంటే ఇష్టమని, ఆర్చరీ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు.

## నేడు నగర పాలకసంస్థ సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు జరగనుందని మేయర్ బివై.రామయ్య గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుంకేసుల రోడ్డు ఎస్‌బిఐ ఎంప్లాయీస్ కాలనీలో తన అధ్యక్షతన సమావేశం జరగనుందని తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యేలు ఎంఎ.హఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, జరదొడ్డి సుధాకర్‌తో పాటు కమిషనర్ ఎ.భార్గవ్ తేజ హాజరు కానున్నారని అన్నారు. గత సెప్టెంబరు 14న చివరి సమావేశం జరిగిందని, 86 రోజుల తర్వాత జరుగుతున్న ఈ సమావేశంలో 28 సాధారణ, 4 సప్లిమెంటరీ తీర్మానాలపై చర్చించనున్నామని తెలిపారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, నగరపాలక సంస్థ అధికారులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## గ్రామాల్లో పరిశుభ్రత మెరుగుపడాలి

**- రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కోన శశిధర్**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

జిల్లాలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగు పడాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కోనశశిధర్ ఆదేశించారు. గురువారం ఆయన మాట్లాడారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా గ్రామకంఠం భూములకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ చట్టం కింద కేటాయించిన లేబర్ బడ్జెట్ లక్ష్యాన్ని అధిగమించేందుకు కూలీల సంఖ్యను మరింత పెంచాలని తెలిపారు. ప్రాధాన్యత భవన నిర్మాణాలను వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు లక్ష్యాలను సాధించేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ సుబ్రమణ్యం, డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వర రావు, డిపిఒ నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్

**- తెలుగు యువత అధ్యక్షులు అబ్బాస్**

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**

దేశం మొత్తానికి బియ్యం ఎగుమతి చేస్తూ అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్ నేడు జగన్ రెడ్డి పాలనలో గంజాయి, డ్రగ్స్‌కు నిలయంగా మారిందని తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షులు ఎస్.అబ్బాస్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి నవీన్, గున్నా మార్క్, సిబి.ఆదిత్యారెడ్డి, మోతీలాల్ విమర్శించారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2021-22లో దేశంలో పట్టుబడిన డ్రగ్స్‌పై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదికలో మిగిలిన రాష్ట్రాల కంటే అత్యధికంగా కేంద్ర బలగాలు ఎపిలో స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేసిందంటే రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా ఎంతగా పాతుకుపోయిందో తెలుస్తుందని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగానికి ప్రధాన కారణం నిరుద్యోగమని తెలిపారు. రాష్ట్ర పోలీసు యంత్రాంగం టిడిపి నాయకులను వేధించడానికి, అక్రమ కేసుల బనాయించడానికి చూపే శ్రద్ధ డ్రగ్స్ మాఫియాపై ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు.

## సమన్వయంతోనే గ్రామాభివృద్ధి

**- ఎంపిపి హేమలత, జడ్‌పిటిసి విరుపాక్షి**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపిపి జూటూరు హేమలత, జడ్‌పిటిసి విరుపాక్షి తెలిపారు. గురువారం మండల కార్యాలయంలో ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ సుధాకర్ రాజు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2023-24పై ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిపి హేమలత, జడ్‌పిటిసి విరుపాక్షి హాజరయి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రెండు వేల జనాభా ఉన్న ప్రతి గ్రామానికీ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని తెలిపారు. సచివాలయంలో ఉన్న అధికారులు, గ్రామంలో పని చేస్తున్న ప్రతి అధికారి కూడా గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలో ప్రణాళికను రూపొందించుకోవాలని చెప్పారు. పంచాయతీలకు వచ్చే నిధులతో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలో చర్చించుకోవాలన్నారు. గ్రామంలో నెలకోసారి సమావేశమై ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ప్రత్యేక శిక్షణ తీసుకున్న పంచాయతీ కార్యదర్శులు నరేంద్ర, సిసింద్రీ, జయరాం నాయక్, సర్పంచులు, ఎంపిటిసిలకు, అధికారులకు గ్రామ ప్రణాళికపై అవగాహన కల్పించారు. వైసిపి యువ నాయకులు జూటూరు మారయ్య, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఇఒఆర్‌డి సంజన్న, పిఆర్ ఎఇ సోలా రెడ్డి, ఎపిఒ మాధవశంకర్, ఎపిఎం నాగార్జున, సిహెచ్‌ఒ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వైద్యులు అందుబాటులో ఉండరా..?

**- సర్పంచి రాము తీవ్ర ఆగ్రహం**

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

సిబ్బందితో మాట్లాడుతున్న సర్పంచి రాము

ప్రజలకు అందుబాటులో ఉండని వైద్యుల వల్ల గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని పెద్ద హరివాణం సర్పంచి రాము తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఆస్పత్రిలో రోగులు పడుతున్న ఇబ్బందుల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దహరివాణం పిహెచ్‌సి పరిధిలో 14 గ్రామాలు ఉన్నాయని, ఈ గ్రామాల నుంచి రోగులు ఆటోల ద్వారా ఆస్పత్రికి వస్తున్నారని తెలిపారు. ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసినా పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. 13 మంది సిబ్బంది ఉన్నప్పటికీ కేవలం ఇద్దరు, ముగ్గురు మాత్రమే ఆస్పత్రికి వచ్చి వైద్యం అందిస్తున్నారని తెలిపారు. వారు కూడా ఉదయం 11 గంటలకు వచ్చి 2 గంటలకే వెళ్లిపోతున్నారని చెప్పారు. వైద్యులు అసలు రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. స్టాఫ్ నర్సులే అరకొర వైద్యం అందిస్తూ గర్భిణులను పట్టణానికి పంపిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. లేకపోతే గ్రామస్తులను సమీకరించి పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు.

## సేంద్రీయ ఎరువులతో దిగుబడి

**- ఎడిఎ మహ్మద్ ఖాద్రీ**

**ప్రజాశక్తి - నందవరం**

మాట్లాడుతున్న ఎడిఎ మహమ్మద్ ఖాద్రీ

రైతులు రసాయనాలతో కాకుండా సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని, అప్పుడే రైతు ఆరోగ్యం, రైతు పొలం ఆరోగ్యంగా ఉంటాయని ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ తెలిపారు. గురువారం నదికైరవాడి గ్రామంలో సర్పంచి ఈశ్వరమ్మ అధ్యక్షతన పొలం బడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సేంద్రీయ ఎరువుల ద్వారా పండించిన పంటకు అధిక ధరలు కల్పించే దిశగా ప్రభుత్వం పొలంబడి నిర్వహిస్తోందని తెలిపారు. జిల్లా మొత్తంలో నదికైరవాడి గ్రామాన్ని క్లస్టర్‌గా ఎంపిక చేసి రైతులకు నేల తయారీ విత్తనం నుంచి పంట కోత వరకు సలహాలు, సూచనలు, 14 వారాల పాటు ఇస్తామని చెప్పారు. మొదటి వారం శిక్షణలో భాగంగా ఎంట్రీ పాయింట్, యాక్టివిటీ కింద రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి రైతులకు వివరించారు. ఎఒ స్రవంతి, ఎఇఒ సురేంద్ర, ప్రభావతి, అగ్రికల్చర్ అసిస్టెంట్ విజయ్ పాల్గొన్నారు.

# లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలి

**- మున్సిపల్ ఛైర్మన్ శాంత - 'మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు-నివారణ చర్యలు' అనే అంశంపై అవగాహన సదస్సు**

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోనిలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ శాంత

సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న లైంగిక వేధింపులు, అవమానాలను ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడే అడ్డుకట్ట సాధ్యమని మున్సిపల్ ఛైర్మన్ శాంత, ఇస్పీ ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు. గురువారం పట్టణంలోని అర్బన్ ఐసిడిఎస్ కార్యాలయంలో 'మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు-నివారణ చర్యలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సిడిపిఒ ఉమా మహేశ్వరి అధ్యక్షత వహించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసులు, న్యాయవాది సావిత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ఎన్నో చట్టాలు అమలు చేస్తోందన్నారు. పురుషులకు ఏ విధంగా తీసిపోని తరహాలో మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. విద్యతోపాటు ఆత్మస్థైర్యం కలిగి జీవించినప్పుడే చైతన్యం వస్తుందన్నారు. గృహ హింస, నిర్భయ, ఫోక్సో చట్టాలు అమలులో ఉన్నా కొందరు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని చెప్పారు. చట్టంలోని కొన్ని లొసుగుల వల్ల మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతూ క్రూరంగా చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కాన్పు సమయంలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టి, మహిళల ప్రాణాలను బలిగొంటున్న రక్తహీనతను ప్రారదోలే దిశగా అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటికి దీపం ఇల్లాలు అనే నానుడి ఉందని, ఇది నిజం అన్నది ప్రతి సందర్భంలోనూ నిరూపితమైందని గ్రహించాలన్నారు. కార్యాలయ సూపరింటెండెంట్ శంకర్, మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ ఉరుకుందమ్మ, సూపర్‌వైజర్లు అంజనమ్మ, రాగిణి, వసంత, సుధావతి, సావిత్రి ఉన్నారు. **మంత్రాలయం** మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో సర్పంచి సుజాత అధ్యక్షతన సచివాలయ మహిళా పోలీసు పార్వతి నేతృత్వంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అంగన్వాడీ సూపర్ వైజర్ నాగలక్ష్మి మాట్లాడుతూ... లైంగిక వేధింపులపై మహిళలను చైతన్య పరిచేందుకు రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న నేటి సమాజంలో గ్రామీణ ప్రాంతాల్లో యువతులు, మహిళలు చైతన్యం కావాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేయించారు. **నందవరం** ఎంపిడిఒ కార్యాలయంలో సూపర్‌వైజర్ సుచరిత ఆధ్వర్యంలో 'మహిళలపై లైంగిక వేధింపులు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎసిడిపిఒ మద్దమ్మ మాట్లాడుతూ... దిశ యాప్, దిశ చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎపిఎం వీరన్న, సూపర్‌వైజర్ విజయ కుమారి పాల్గొన్నారు.

మంత్రాలయంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

నందవరంలో మాట్లాడుతున్న ఎసిడిపిఒ మద్దమ్మ

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి

## ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన కల్పించాలి

**- మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి**

**ప్రజాశక్తి - ఆదోని**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 12 నుంచి 18 వరకు చెత్త సేకరణ కోసం నిర్వహించే క్లాప్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ మెప్మా సిబ్బందిని ఆదేశించారు. గురువారం వారు మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడారు. 12, 13న ఆర్‌పిలు తమ వార్డుల్లో క్లస్టర్ స్థాయిలో పొడి, తడి చెత్త, హానికర చెత్తను వేరు చేసి పురపాలక సంఘం సిబ్బందికి అందించేందుకు అవగాహన కల్పించాలని, 14న వార్డు స్థాయి సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. 15న అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని చెప్పారు. 16న క్లాప్ ప్రోగ్రాంపై ఎగ్జిబిషన్, సోషల్ మీడియాలో ప్రజలకు అవగాహన, 17న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. 18న క్లాప్ ప్రోగ్రాం కోసం ప్రతిజ్ఞ, ర్యాలీ, మానవహారం తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

## ఎస్ఐని కలిసిన సర్పంచి హైమావతి

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచి

గోనెగండ్ల నూతన ఎస్ఐ ఎం.తిమ్మారెడ్డిని మేజర్ పంచాయతీ సర్పంచి హైమావతి, ఆమె భర్త అడ్వకేట్ చంద్రశేఖర్‌లు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్ సిఐ మంజునాథ్ కూడా కలిసి గ్రామ విషయాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తేవాలని సర్పంచికి తెలిపారు. అడ్వకేట్ వెంకటేశ్వర్లు, బాబు నాయుడు, మల్దకల్, మునెయ్య, రంగస్వామి పాల్గొన్నారు.

## కదిరికోట ఆదెన్నకు పితృవియోగం

**- గుండెపోటుతో కదిరికోట నరసన్న మృతి**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

టిడిపి నాయకులు కదిరి కోట ఆదెన్న తండ్రి కదిరికోట నరసన్న (67) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని ఎస్సీ శ్మశాన వాటికలో జరుగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# నివాసం కూల్చారు...

**- న్యాయం చేయండని వృద్ధ దంపతుల వినతి**

**- బాధితులకు అండగా నిలిచిన టిడిపి నాయకులు**

**ప్రజాశక్తి - ఆదోని**

వృద్ధులమని కనికరం కూడా చూపకుండా తల దాచుకుంటున్న కొట్టాన్ని కూల్చి రోడ్డున పడేశారని బైచిగేరి గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు లక్ష్మమ్మ, తిమ్మన్న కన్నీటి పర్యంతమయ్యారు. గురువారం టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్లు భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్పతో కలిసి వృద్ధ దంపతులు ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2014లో ప్రభుత్వం తమకు ఆ భూమికి పట్టా ఇచ్చిందన్నారు. అందులోనే తాము చిన్న కొట్టం వేసుకొని తలదాచుకుంటున్నామని తెలిపారు. తమ కుమారులు టిడిపి సానుభూతి పరులని కక్ష సాధింపుతోనే అధికార పార్టీ గ్రామ నాయకుల ప్రోద్బలంతో కొట్టాన్ని కూల్చేసి అందులో ఉన్న సామగ్రిని రోడ్డున పడేశారని వాపోయారు. సర్పంచి మహాదేవ, కృష్ణారెడ్డి, బుసురెడ్డి అక్కడున్న అధికారులతో కలిసి సచివాలయానికి తమ కొట్టం అడ్డు వస్తుందని తమకు నోటీసు ఇవ్వకుండా కూల్చేయడం ఏమిటని బోరున విలపించారు. 2014 నుంచి తాము గుడిసెకు ప్రభుత్వానికి గుత్త కూడా చెల్లిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదని, తమ కుమారుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ చేపట్టి అధికారులపై, స్థానిక నాయకులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణమన్నారు. సబ్ కలెక్టర్ అక్కడున్న విఆర్ఒ బసవరాజుకు ఫోన్ చేసి పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించారు. విచారణ చేపట్టి వృద్ధులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట టిడిపి నాయకులు ఎల్ఎల్‌సి డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్ బసాపురం రామస్వామి, ఫక్రుద్దీన్, సోమశేఖర్ రెడ్డి, గోపాల్, మల్లేశప్ప, నాగరాజు, మల్లికార్జున ఉన్నారు.

న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు విన్నవిస్తున్న వృద్ధ దంపతులు

## ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - నందవరం**

నందవరం ఇన్‌ఛార్జీ ఎంపిడిఒగా సూపరింటెండెంట్ కృష్ణమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఒ రాణెమ్మ ఈ నెల 20 వరకు సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో కార్యాలయ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న కృష్ణమూర్తికి ఫుల్ అడిషనల్ ఛార్జ్‌తో బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు తీర్చడానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## స్వర్ణమయం... రాఘవేంద్రుని మూల బృందావనం

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని మూల బృందావనం స్వర్ణమయమై భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం రాఘవేంద్రస్వామి బృందావనాన్ని పూజారులు నిర్మాల్యం చేసి తులసి అర్చన, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణకవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ పుష్ప హారాలతో అలంకరిచారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకున్నారు.

## క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- వైద్యాధికారి డాక్టర్ ఈశ్వర్**

అవగాహన కల్పిస్తున్న బాబు రాజు

**ప్రజాశక్తి - ఆదోని**

క్షయ (టిబి) వ్యాధి పట్ల నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ ఈశ్వర్, ఎంపిహెచ్ఒ బాబురాజు సూచించారు. గురువారం పట్టణంలోని 17వ వార్డు సుంకులమ్మ గుడి వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండు వారాల పాటు దగ్గు ఉంటే టిబిగా అనుమానించాలని తెలిపారు. టిబి ఉన్న వ్యక్తికి ఉదయం, సాయంత్రం జ్వరం వస్తూ ఉంటుందన్నారు. బరువు తగ్గడం, శ్వాస తీసుకోవడంలో కష్టంగా ఉండడం, రక్తపు ఛారలతో కూడిన గళ్ల పడటం తదితర లక్షణాలు ఉన్న వారు ఉదయం తీసిన గళ్లను తీసుకొస్తే నిర్ధారణ కోసం పరీక్షకు పంపుతామన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకూ బిసిజి వ్యాక్సిన్ వేయించాలన్నారు. వ్యక్తికి, వ్యక్తికి రెండు మీటర్ల దూరం పాటించడం, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు మోచేతిని అడ్డం పెట్టకోవడం, సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల ఈ వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చన్నారు. అడ్మిన్ మల్లికార్జున, టిబిహెచ్‌వి సుబ్బమ్మ పాల్గొన్నారు.

కాలిపోతున్న గడ్డివామి

## 10 ఎకరాల గడ్డివామి దగ్ధం

**- రూ.లక్ష ఆస్తి నష్టం**

**- ఆందోళన చెందుతున్న బాధితులు**

**ప్రజాశక్తి - హోళగుంద**

మండలంలోని ఇంగలదల్ గ్రామానికి చెందిన మాల మల్లేశప్ప, మాల దేవేంద్రప్పకు చెందిన పది ఎకరాల గడ్డి వామి దగ్ధమై రూ.లక్ష ఆస్తినష్టం జరిగిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... గురువారం సాయంత్రం గుర్తు తెలియని ఆకతాయిలు గడ్డివామికి నిప్పంటించారని కొంతమంది తెలుపగా మరి కొంతమంది ప్రమాదవసత్తు జరిగిందని పేర్కొంటున్నారు. వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వగా పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అభివృద్ధిలో సచివాలయం కీలకం

**- ఎంపిడిఒ రాముడు**

**ప్రజాశక్తి - సిబెళగల్**

గ్రామాల అభివృద్ధిలో సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకమని ఎంపిడిఒ రాముడు తెలిపారు. గురువారం పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. అభివృద్ధి, ప్రణాళిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఇఒఆర్‌డి సందీప్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం...

**- 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి'లో టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ**

**ప్రజాశక్తి -దేవనకొండ**

దేవనకొండలో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు తప్ప గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధీ చేయలేదని, అంతా శూన్యమని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ విమర్శించారు. గురువారం మండలంలోని పి.కోటకొండ గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. గ్రామంలో ప్రజల వద్దకు వెళ్లి వైసిపి పాలనలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలతో మాట్లాడారు. వైసిపి పాలనలో నిత్యావసర సరుకులు, విద్యుత్, బస్ ఛార్జీలు విపరీతంగా పెరగాయన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు టిడిపికి మద్దతు తెలిపి వైసిపి ప్రభుత్వాన్ని ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని కోరారు. టిడిపి నాయకులు బడి గింజల రంగన్న, ఉచ్చీరప్ప, రామారావు నాయుడు, మల్లయ్య, మల్లికార్జున గౌడ్, ఆకుల వీరేశ్, సుభాన్, వెంకటస్వామి గౌడ్, మల్లెపల్లి సుంకన్న, కర్రెక్క, వల్లే వెంకటేష్, చిట్యాల ముని రంగడు, చెన్న కేశవులు, ముని పాల్గొన్నారు. **నందవరంలో** టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవ రావు దేశాయ్ ఆధ్వర్యంలో 'ఇదేం కర్మ' నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి మాట్లాడారు. నకిలీ విత్తనాలతో మండల రైతులు మోసపోయారని తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు ఈరన్న గౌడ్, రఘు మూర్తి స్వామి, వెంకట్రామిరెడ్డి, ఖాసీం వలీ, చిన్న రాముడు, బండే గురు స్వామి, పెద్ద రాముడు, రైస్ మిల్ నారాయణరెడ్డి, గోపాల్, మస్తాన్, శ్రీనివాస్ రెడ్డి, రెహ్మాన్, బోయ వీరేష్, వడ్డే గోపాల్, భార్గవ్, దావీదు, బాలరాజు, రామకృష్ణా రెడ్డి, ఆదిశేషు, పరశురాముడు, వీరారెడ్డి పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బుద్ధారెడ్డి మాట్లాడారు. మూడున్నర ఏళ్ల పరిపాలనలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజా విశ్వాసం కోల్పోయారని తెలిపారు. సమస్యలు తెలుసుకునేందుకు ఇంటికి వెళితే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఓ చేత్తో ఇచ్చి రెండు చేతులతో లాక్కుంటున్నారని, ఆయనను సాగనంపాలని ప్రజలే చెబుతున్నారని అన్నారు. మాజీ కౌన్సిలర్ అంజి ఉన్నారు. అలాగే పట్టణంలోని 16వ వార్డు అంబేద్కర్ నగర్‌లో టిడిపి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర సెక్రటరీ లక్ష్మి నారాయణ మాట్లాడారు. టిడిపి నాయకులు వైపి.నాగరాజు, రామచంద్ర, ఎం.విజయ్ కుమార్, మంజునాథ, ఉమాపతి, కెసి.వీరేష్ బాబు, కురువ రాము, రంగస్వామి, రాజు, సిద్ధు, సి.వెంకటేష్ పాల్గొన్నారు. **25 వార్డులో...** అందరికీ ఇల్లు నిర్మించి ఇస్తామని అధికారంలోకి ఇచ్చిన జగన్‌మోహన్ రెడ్డి విస్మరించారని ఆ వార్డు ఇన్‌ఛార్జీ మల్లికార్జున తెలిపారు. నారాయణగుంట ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు.

నందవరంలో నివాళులర్పిస్తున్న బీవీ

ఆదోనిలో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

## సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేయాలి

**- టిఎన్ఎస్ఎఫ్ నాయకులు**

**ప్రజాశక్తి - కౌతాళం**

మండలంలో సంక్షేమ హాస్టల్‌ను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలని టిఎన్ఎస్ఎఫ్ తాలూకా నాయకులు రామచంద్ర నాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అక్షరాస్యతలో జిల్లా పశ్చిమ ప్రాంతం చాలా వెనుకబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పేద విద్యార్థులు చదువులో మధ్యలోనే ఆపి బాల కార్మికులుగా మారుతున్నారని తెలిపారు. మరి కొంతమంది విద్యార్థులు వలసలు వెళ్లి జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని కోరారు. టిఎన్ఎస్ఎఫ్ నాయకులు అద్దాల శ్రీరామ్, మహబూబ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

## ఎంఎన్ఒ, ఆఫీస్ సబార్డినేట్‌లను కొనసాగించాలి

**- 4వ తరగతి ఉద్యోగుల యూనియన్**

**ప్రజాశక్తి-ఆలూరు**

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పని చేస్తున్న ఎంఎన్ఒ, ఆఫీసు సబార్డినేట్‌లను యథావిధిగా కొనసాగించేటట్లు చూడాలని 4వ తరగతి ఉద్యోగుల యూనియన్ ఆలూరు తాలూకా అధ్యక్షులు డి.రంగస్వామి కోరారు. గురువారం కర్నూలుకు వచ్చిన రాష్ట్ర 4వ తరగతి ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు మల్లేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడారు. జిఒ 143 నాలుగో తరగతి సిబ్బందికి ఇబ్బంది కలిగే విధంగా ఉందని తెలిపారు. జిఒను సవరించి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఎంఎన్ఒ, ఆఫీస్ సబార్డినేట్‌లను యథావిధిగా కొనసాగించాలని కోరారు. రామకృష్ణ, గౌస్, మజ్జిద్, నీలకంఠ రాజు పాల్గొన్నారు.



రాష్ట్ర అధ్యక్షునికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎంపికైన నూతన కమిటీ

## 'నారాయణ'లో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

పట్టణంలో ఉన్న నారాయణ జూనియర్ కళాశాలలో గురువారం ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విజయ్, ఎస్ఎఫ్ఐ నాయకులు అజిత్ మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాలలో ఉన్న సమస్యలను, విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. జాతీయ నూతన విద్యా విధానం అమలయితే జరిగే నష్టాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఎన్ఇపిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. నారాయణ కళాశాల నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా పవన్, గణేష్‌ను ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శి సైపుల్లా, కమిటీ మెంబర్లు, నారాయణ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## భగవద్గీత పఠన పోటీల్లో మాంటి ప్రతిభ

**ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్**

ఇటీవల గీత జయంతి సందర్భంగా స్థానిక విజ్ఞాన పీఠంలో నిర్వహించిన భగవద్గీత కంఠస్త పోటీల్లో మాంటి ఇంటర్నేషనల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో మాంటి ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 22 మంది విద్యార్థులు భగవద్గీతను అనర్గళంగా కంఠత చెప్పి బహుమతులు సాధించారు. గురువారం పాఠశాల మీటింగ్ హాలులో అభినందన సభ నిర్వహించారు. పాఠశాల వైస్ ప్రిన్సిపల్ క్రిష్టి ఇమ్మానుయేల్, కోఆర్డినేటర్లు నిఖాత్ అలి, తబస్సుమ్, కృష్ణ కాంతిలు విద్యార్థులను అభినందించారు, విద్యార్థులతో గీతా పఠనాన్ని అధ్యయనం చేయించిన ఉపాధ్యాయులు లక్ష్మీ నారాయణ, శ్రీదేవి, లక్ష్మీ రాజ్యం, శుభ రజితను స్కూల్ అధినేత డాక్టర్ గాయని రాజశేఖర్ అభినందించారు.

## పెండింగ్‌లో రే సర్వే పనులు పూర్తి చేయాలి

**- సిసిఎల్ఎ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

పెండింగ్‌లో ఉన్న రీసర్వే పనులను వాయిదా వేయకుండా పూర్తి చేయాలని సిసిఎల్ఎ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదేశించారు. గురువారం ఆయన అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రీ సర్వేలో తలెత్తిన సమస్యలను ప్రణాళికబద్ధంగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలని తెలిపారు. ఫైనల్ ఆర్ఒఆర్‌లో పొరపాట్లు దొర్లితే సవరించుకునేందుకు అవకాశం కల్పించాలని చెప్పారు. రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించి భూ సమస్యలకు పూర్తిస్థాయి పరిష్కార మార్గాలు చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వే వివరాలు రికార్డుల్లో పొందుపరిచి భద్రపరచాలని తెలిపారు. సమగ్ర సర్వే పూర్తయిన గ్రామాల్లో భూహక్కుదారులకు జగనన్న భూహక్కు - భూరక్ష పత్రాల జారీకి చర్యలు తీసుకోవాలన్నారు.

## ఉర్దూ వర్సిటీలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

ఉర్దూ యూనివర్సిటీలో 2022-23 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో మిగిలిన సీట్లలో అడ్మిషన్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు ఈ నెల 9లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బల్లిని చేతితో నలిపేసిన హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడితో వాగ్వివాదం చేస్తున్న కస్టమర్లు

# షరతులతో 'సున్నా'

- ఈ క్రాప్‌లోని పంటకు రుణం తీసుకుంటేనే అర్హత
- అర్హత కోల్పోయిన 90 శాతం మంది రైతులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం రైతులను అందించే సున్నా వడ్డీ పథకానికి షరతులు తీవ్రం చేయడంతో రైతులకు సున్నానే మిగులుతోంది. ఈ క్రాప్‌లో నమోదు చేసిన పంటను సాగు చేసి ఆ పంటకే రుణం తీసుకుంటేనే ఈ పథకానికి అర్హత అంటూ నిబంధన తీసుకురావడంతో 90 శాతం మంది రైతులు ఆ పథకానికి అర్హత కోల్పోయారు.....

ఉమ్మడి జిల్లాలో 54 మండలాల్లో దాదాపు ఆరు లక్షల మంది రైతులు పంట సాగుపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరిలో దాదాపు నాలుగు లక్షల మంది రైతులు పంట సాగు కోసం బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. జిల్లాలో దాదాపు నాలుగు లక్షల మంది రైతులు ఖరీఫ్‌లో తీసుకున్న పంట రుణాలకు సంబంధించి రూ.3.62 కోట్లు, రబీలో తీసుకున్న పంట రుణాలకు సంబంధించి రూ.1.70 కోట్లు బ్యాంకులకు వడ్డీ కింద చెల్లించాల్సి ఉంది. దాదాపు ఎనిమిది నెలల నిరీక్షణ తర్వాత నింపాదిగా 2020 రబీతోపాటు 2021 ఖరీఫ్ సీజన్‌లకు సంబంధించి రైతులు తీసుకున్న పంట రుణాలకుగాను వారు చెల్లించిన వడ్డీని గత వారంలో ముఖ్యమంత్రి జగన రైతుల ఖాతాలకు జమ చేశారు. కర్నూలు జిల్లాలో 10,1,093 మంది రైతుల ఖాతాలకు రూ.22.44 కోట్లను జమ చేశారు. నంద్యాల జిల్లాలో 81,294 మంది రైతులకు రూ.16.24 కోట్లను జమ చేశారు. మొత్తం రెండు జిల్లాలకు కలిపి రూ.38.68 కోట్లను జమ చేశారు. సున్నా వడ్డీ పథకాన్ని విడుదల చేయడానికి ముందుగా రైతులు బ్యాంకులకు రుణం మార్చిలోపు చెల్లించాలని, ఈక్రాప్ నమోదులో ఏ పంటను సాగు చేసి ఉంటారో దానికే బ్యాంకులో రుణం తీసుకుని ఉండాలని షరతు విధించింది. ఈ నిబంధనతో దాదాపు 90 శాతం రైతులు అర్హత కోల్పోవాల్సి వచ్చింది. వాస్తవంగా రైతు పొలంలో ఏ పంట సాగు చేసినా రుణం తీసుకుని ఉంటే వడ్డీని బ్యాంకులకు నేరుగా జమ చేయాల్సి ఉంది. ఈ పరిస్థితిని తారుమారు చేసినందు వల్ల సున్నా వడ్డీ పథకం రైతులకు ఏ మాత్రం ప్రయోజనకరంగా లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

**ఈక్రాప్‌తో లింక్...**

ఇప్పటి దాకా రైతులు బ్యాంకుల్లో పంట సాగు కోసం రుణం తీసుకున్నారు. ఈ రుణాలకు సంబంధించి ప్రభుత్వం ఏడు శాతం వడ్డీ చెల్లించేది. తాజాగా లబ్ధిదారుల్లో కోత పెట్టేందుకు కొత్త మార్గాలను అమలు చేసేందుకు సిద్ధమైంది. బ్యాంకుల్లో రైతులు ఏ పంట సాగు కోసం రుణం తీసుకున్నారో ఆ పంటను మాత్రమే తప్పనిసరిగా సాగు చేయాలని, ఈ సమాచారాన్ని ఆర్‌బీకే కేంద్రాల్లోని అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం రైతులు ఏదో ఒక పంట సాగు చేస్తున్నట్లు బ్యాంకులకు సమాచారం అందించి రుణం తీసుకుంటున్నారు. ఇకపై ఆ విధంగా చేయడం కుదరదు. ఆర్‌బికెల ద్వారా ఈక్రాప్ బుకింగ్ సమర్థంగా అమలు చేసి అందుకు అనుగుణంగా రుణాలు ఇచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీని వల్ల రైతులకు పంట రుణం పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉంది.

# టిఫిన్‌లో బల్లి

- నంద్యాల టూరిస్టు హోటల్‌లో ఘటన
- బల్లిని చేతితో నలిపేసిన హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాలలోని సంజీవనగర్ గేట్ వద్ద ఉన్న టూరిస్టు హోటల్‌లో కస్టమర్ తెచ్చిన ఇడ్లీ సాంబారు ప్లేట్‌లో బల్లి వచ్చిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. టూరిస్టు హోటల్‌కి వెళ్లిన ఓ కస్టమర్ ఇడ్లీ సాంబారుకు ఆర్డర్ ఇచ్చాడు. వెయిటర్ ఇడ్లీ సాంబారు తెచ్చి ఇచ్చాడు. కస్టమర్ ఇడ్లీ సాంబారును కలుపుతుండగా బల్లి కనిపించడంతో హతాశుయ్యాడు. వెంటనే ఆ వ్యక్తి హోటల్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. టిఫిన్‌లో బల్లి పడిన విషయాన్ని తెలుసుకున్న నంద్యాల హొటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, శ్రీనిధి హొటల్ యజమాని స్వామి హుటాహుటిన అక్కడికి చేరుకున్నాడు. కస్టమర్‌కు నచ్చ జెప్పాల్సింది పోయి టూరిస్ట్ హోటల్ యాజమాన్యానికి వత్తాసు పలికాడు. ప్లేట్లో ఉన్న బల్లిని చేత్తో తీసుకుని నలిపివేసి నామరూపాలు లేకుండా చేయడానికి ప్రయత్నం చేసాడు. దీంతో హోటల్‌కు వచ్చిన వారు ఆయన తీరుపై ముక్కున వేలేసుకున్నారు. గతంలో టూరిస్ట్ హోటల్‌లో టిఫిన్‌లో బొద్దింక, నేడు బల్లి, రేపు ఏమి వస్తుందోనని కస్టమర్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెళ్లి పోయారు. ఇటువంటి హొటల్స్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి హొటల్‌ను సీజ్ చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని నంద్యాల పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇడ్లి ప్లేట్‌లో ఉన్న బల్లి

# గ్రామకంఠం భూముల సర్వే వేగవంతం

- పారిశుధ్యం మెరుగుపడాలి - ఉపాధి కూలీల సంఖ్యను పెంచండి
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోనశశిధర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గ్రామకంఠం భూముల సర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోనశశిధర్ అన్ని జిల్లాల కలెక్టర్లను కోరారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో జగనన్న స్వచ్ఛ సంకల్పం, వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా గ్రామకంఠం భూముల సర్వే, ఉపాధి హామీ, ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా గ్రామకంఠం భూములకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలీడేషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద కేటాయించిన లేబర్ బడ్జెట్ లక్ష్యాన్ని అధిగమించేందుకు కూలీల సంఖ్యను మరింత పెంచాలన్నారు. ప్రాధాన్యత భవన నిర్మాణాలను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా లక్ష్యాలను సాధించేందుకు శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ గ్రామకంఠం భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ మనోహర్, డిపిఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు

# జీతాలు చెల్లించాలి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.నాగమణి

ప్రజాశక్తి - నంద్యాల

ఉద్యోగ, ఉపాధ్యాయులకు నవంబర్ నెల జీతాలు డిసెంబరు 8వ తేదీ దాటినా ఇంతవరకు జమ కాలేదని, వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పివి ప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులు నెల పొడవునా పని చేసి 1వ తేదీ జీతం కోసం ఎదురు చూస్తారని, అయితే ఈ మధ్యకాలంలో ఒకటితో జీతాలు కనుమరుగైపోతున్నాయని తెలిపారు. గృహ, వ్యక్తిగత, విద్య, పిల్లల పెళ్లిళ్లకు, చదువులకు చేసిన అప్పులు క్రమేణా దిద్దుకోవటం కోసం ఒకటవ తేదీ జీతం కోసం ఎదురు చూస్తారని, ఈనాడు ఆ పరిస్థితి లేకపోవడం, ఇంటి బాడుగ, పాల బిల్లు, కిరాణం, కూరగాయలు తదితర అవసరాలు తీర్చుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జీతాల కోసం ఇంకా ఎన్నాళ్లు ఎదురు చూడాలని ప్రశ్నించారు. పరిస్థితి ఇలానే ఉంటే ఉద్యోగ ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమానికి వెనకాడబోరని హెచ్చరించారు. ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల అవసరాలు గ్రహించి వెంటనే జీతాలు విడుదల చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్ మాట్లాడుతూ ప్రమోషన్లు, బదిలీలు జరగక ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సర్దుబాటు ప్రక్రియ నిలిపివేసి ప్రమోషన్లలో ఆసక్తి ఇచ్చిన వారికి వెంటనే పాఠశాలలో చేరే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోధనేతర పనుల నుండి హెచ్ఎంలను,ఉపాధ్యాయులను తప్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు ఎస్.జాకీర్, జిల్లా కార్యదర్శులు వివి రామ్ మోహన్, కె.రామకృష్ణుడు, మొహమ్మద్ హుస్సేన్, శ్రావణ, మొహమ్మద్ కాశీం, ఎం.వెంకటేశ్వర్లు, వైవి రమణ, బాలస్వామి, రవి, మధు, రామయ్య, నాగార్జున, భాస్కర్, పి.గోపాల్, బిపి వెంకటేశ్వర రెడ్డి, శేకర్, అరవింద్, ఎంవి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నాగమణి

# జలాధివాసం వీడుతున్న సంగమేశ్వరుడు

- కృష్ణమ్మ ఒడి నుంచి బయటపడుతున్న ఆలయ గోపురం

ప్రజాశక్తి - కొత్తపల్లి

గత కొన్ని నెలల నుంచి కృష్ణమ్మ ఒడిలో చేరి జలాధివాసం అయిన ప్రాచీన సంగమేశ్వరాలయం నెమ్మదిగా ఆలయ గోపురం బయటపడుతుంది. శ్రీశైలం జలాశయం ప్రాజెక్టులో నీటిమట్టం క్రమక్రమంగా తగ్గుతుండడంతో కొత్తపల్లి మండలంలోని సంగమతీరంలో వెలసిన పురాతన సంగమేశ్వర ఆలయం బయట పడుతోంది. దీంతో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో సంగమేశ్వరాలయం శిఖరానికి కుంకుమార్చన, పుష్పార్చన, జలాభిషేకం, మంగళహారతి విశేష పూజలు చేశారు.

బయటపడుతున్న సంగమేశ్వర ఆలయ శిఖరం

# నత్త నడకన మురుగునీటి శుద్ధి కేంద్రం పనులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కేంద్రంలో డ్రైనేజీ కాలువల నుండి వచ్చే మురికి నీటిని శుద్ధి చేసి వాటిని రైతుల పంట పొలాలకు, వివిధ పరిశ్రమలకు, ప్లాంట్లకు వాడుకోవచ్చనే లక్ష్యంతో మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ప్రభుత్వం చేపట్టింది. 10 ఎంఎల్ కెపాసిటీ సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్‌ను రూ. 30 కోట్ల వ్యయంతో పద్మనంది చామకాల్వ వద్ద నిర్మించతలపెట్టారు. దాదాపు ఆరు నెలల కిందట ఈ ప్లాంట్ పనులను ప్రారంభించినప్పటికీ ఇంకా పూర్తి కాలేదు. పనులు నత్తనడకన నడుస్తున్నాయి. దీనికి కారణం అధికారుల పర్యవేక్షణలోపం. గుత్తే దారులు, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కొట్టిచ్చినట్లు కనపడుతోంది. ప్లాంటును మూడు నెలల్లో పూర్తి చేయాలని పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ ద్వారా చర్యలు చేపట్టారు. ప్రభుత్వం చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలకు ఇంజనీరింగ్ అధికారులు తూట్లు పొడుస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గత ఆరు మాసాలుగా ఈ ప్లాంట్ నిర్మాణానికి పనులు జరుగుతుండటం కొసమెరుపు. ఈ ప్లాంట్ పూర్తయిన తర్వాత శుద్ధి చేసిన నీటిని ఉపయోగించుకోవడానికి మద్దిలేరు దగ్గర పంప్ హౌస్ నిర్మాణం చేపట్టడంతో పాటు వాటికి సంబంధించిన విద్యుత్ సౌకర్యం, పైపులైన్ వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఈ పనులన్నింటినీ మార్చి నాటికి పూర్తి చేసి నీటిని అవసరాలకు ఉపయోగించుకోవాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్లాంట్ పనులు వేగంగా సాగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిర్మాణంలో ఉన్న మురికి నీటి శుద్ధి కేంద్రం

మాట్లాడుతున్న మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ రాఘవ రెడ్డి

## 'ఫిష్ ఆంధ్ర' మత్స్యకారులకు వరం : జెడి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రైతులుకు గిట్టుబాటు ధర కల్పించ టానికి, వినియోగదారులకు నాణ్యమైన మంచి చేపలను అందించటానికి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి ఏర్పాటు చేసిన 'ఫిష్ ఆంధ్ర' పథకం మత్స్యకారులకు వరంలాంటిందని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ రాఘవ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మునిసిపల్ కమిషనర్ సి. రవిచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమీషనర్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ పథకంలో భాగంగా చేపల ఉత్పత్తులు, వినియోగాన్ని పెంచడానికి ఔత్సాహికులయిన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఫిష్ ఆంధ్ర అవుట్ లెట్‌లు ఏర్పాటు చేయడానికి రూ. 10 లక్షలు, 20 లక్షలు, 50 లక్షలతో జనరల్ కేటగిరి వారికి 40 శాతం మహిళలకు, ఎస్సీలకు 60 శాతం సబ్సిడీ తో ఏర్పాటు చేయబడునని పేర్కొన్నారు. ముందుగా లబ్దిదారుడు సొంతంగా కానీ, బ్యాంక్ నుండి లోను తీసుకొని యూనిట్ ఏర్పాటు చేసిన వెంటనే బాక్‌ఎండ్ సబ్సిడీ వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత నంద్యాల జిల్లా మత్స శాఖ జాయింట్ డైరెక్టర్‌ని కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

## క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఎస్‌విఆర్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.దినేష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎస్‌విఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మూడ్రోజుల పాటు సూపర్ నోవా పేరుతో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విద్యతోపాటు మానసిక ఒత్తిడిని అధిగమించడం కోసం, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం కోసం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.మల్లికార్జున్ రెడ్డి విద్యార్థులలో క్రీడలు నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని అన్నారు. శారీరకంగా, మానసికంగా విద్యార్థులను దృఢంగా తయారు చేస్తాయని తెలిపారు.

మాట్లాడుతున్న దృశ్యం

# అఖిలభారత మహాసభను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - నంద్యాల

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 13 నుండి 16వ తేదీ వరకు జరిగే భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి నిరంజన్ కోరారు. గురువారం నంద్యాల పట్టణంలోని శ్రీ రామకృష్ణ పిజి కళాశాలలో విద్యావేత్త రామకృష్ణారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్‌లు మహాసభ గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ విద్య అభివృద్ధి కోసం, విద్యార్థుల సమస్యలు పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ ముందంజలో ఉంటుందని అన్నారు. భవిష్యత్‌లో విద్యారంగం ఎదుర్కోబోతున్న పరిస్థితులపై సమీక్షించి విద్యాభివృద్ధికి కషి చేయడం కోసం ఈ అఖిల భారత మహాసభలు వేదిక కానున్నాయని తెలిపారు. విద్యారంగంలో ఒక గొప్ప అభ్యుదయ శక్తిగా భారత విద్యార్థి ఫెడరేషన్ పని చేస్తుందని కొనియాడారు. నేడు దేశంలో ప్రభుత్వ విద్య ప్రశ్నార్థకం అవుతున్న ప్రమాదం పొంచి ఉందని, దానికి కారణం కేంద్ర ప్రభుత్వం విద్యారంగ బాధ్యతల నుంచి తప్పుకునే ప్రయత్నం చేయడమేనని అన్నారు. జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించకుండా కేవలం 2 శాతం కేటయించడం దారుణమన్నారు. విద్యారంగాన్ని కార్పొరేట్లకు కట్టపెట్టే యత్నం జరుగుతుందని, ముఖ్యంగా విద్యార్థులు మేలుకొని విద్యారంగాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు కిరణ్, మధు, సుమంత్, భార్గవ, లక్ష్మి నారాయణ, శరత్ తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత మహాసభ పోస్టర్లు విడుదల చేస్తున్న రామకృష్ణా రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు

# తైక్వాండో రాష్ట్ర పోటీల్లో అరుణోదయ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలలో పట్టణంలోని అరుణోదయ యూపీ స్కూల్ విద్యార్థి ఐనియ బంగారు పతకాన్ని సాధించింది. నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాలలో నవంబరు 25, 26, 27 తేదీలలో రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్షిప్ పోటీలు తైక్వాండో రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగాయి. సబ్ జూనియర్ బాలికలు 26 కేజీల విభాగంలో ఐనియ పాల్గొని బంగారు పతాకం సాధించింది. గురువారం పాఠశాలలో కరస్పాండెంట్ అమీర్ భాషా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల విద్యాధికారి శోభా వివేకవతి ముఖ్యఅతిథిగా పాల్గొని ఐనీయాకు శాలువా కప్పి, అభినందించి బహుమతి ప్రదానం చేశారు. ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించడం అభినందనీయ మన్నారు. ముస్లిం విద్యార్థిని ఐనియ బంగారు పతకం సాధించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఇమామ్ హుస్సేన్, ఆసియా, మండల ప్రభుత్వ ఖాజీ మౌలానా మహమ్మద్ సాదిక్, విద్యార్థిని తండ్రి అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

ఐనియను అభినందిస్తున్న దృశ్యం

# నంద్యాల పట్టణ రహదారులకు మహర్దశ

- చురుగ్గా అంతర్గత రోడ్డు వెడల్పు పనులు
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రహదారుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, నూతన ఏర్పడిన నంద్యాల జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో ప్రధాన రహదారులకు మహర్దశ పట్టిందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ తెలిపారు. గురువారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. నంద్యాల పట్టణంలో రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, రహదారుల అభివృద్ధితో పట్టణ రూపురేఖలు మారిపోతున్నాయని చెప్పారు. నంద్యాల పట్టణంలోని ఆటోనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఐటిసి సెంటర్, బొమ్మల సత్రం ఫ్లైఓవర్, రైతు నగరం ఫ్లైఓవర్, నూనెపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి, చిన్న చెరువు కట్ట తదితర ప్రాంతాలలో అభివవృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయని అన్నారు. రోడ్లు సుందరీకరణంగా మారుతున్నాయని తెలిపారు. అత్యంత రద్దీగా ఉండే నూనెపల్లె జంక్షన్ అండర్ పాస్ రోడ్డు, నూనెపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి 184/0 నుండి 186/0 వరకు, నంద్యాల-కొత్తపల్లి రోడ్డు 175/6 నుండి 177/8 వరకు రోడ్డు అభివృద్ధి పనులు 3.75 కోట్ల రూపాయలతో పూర్తి చేయడంతో ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా ప్రయాణం సాఫీగా సాగుతోందన్నారు. బొమ్మల సత్రం ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుండి నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు 2.5 కిలోమీటర్ల మేర ప్రస్తుతం ఉన్న రెండు లైన్ల రహదారిని నాలుగు లైన్ల రహదారిగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం 13.4 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని తెలిపారు. రోడ్డుకిరువైపులా మురికి కాలువలు నిర్మించడంతోపాటు మధ్య భాగంలో డివైడర్లను కూడా ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఇవి పూర్తయితే ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రయాణ మార్గం సుగమమం అవుతుందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తం అవుతుందని తెలిపారు. ఐటిసి పొగాకు కంపెనీ దగ్గర కర్నూలుకు వెళ్లే బైపాస్ రహదారి వలయాన్ని ఏర్పాటు చేసేందుకు 20 లక్షల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో టెండర్లను ఖరారు చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. అలాగే జిల్లాలో నంద్యాల-మహానంది, మాధవా నంతపురం-బందర్లపల్లి చెక్ పోస్ట్ రోడ్డు, నంద్యాల- ఆత్మకూరు, తిమ్మనాయుని పేట రోడ్డు, చాగలమర్రి-రుద్రవరం- మహదేవపురం, కోవెలకుంట్ల-ఆళ్లగడ్డ, పాణ్యం-బనగానపల్లె, ప్యాపిలి-యాగంటి-బనగానపల్లె, ఒంగోలు-నంద్యాల రహదారుల నిర్మాణాలు, మరమ్మతులు పూర్తి అయ్యాయని తెలిపారు. నంద్యాల - ఎర్రగుంట్ల రైల్వే లైన్ పనుల నిమిత్తం రూ.72 కోట్లతో చేపట్టిన డైవర్షన్ రోడ్డు పనులు పూర్తి చేశామన్నారు. మొత్తం జిల్లాలో రూ.360.84 కోట్లతో 496 కిలోమీటర్లకు సంబంధించి 64 రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు.

డిప్యూటీ తహశీల్దార్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు

## రుద్రవరం డిటిగా మహబూబ్ బాషా

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం డిప్యూటీ తహశీల్దారుగా మహబూబ్ బాషాను నియమించినట్లు తహశీల్దారు వెంకట శివ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న మహబూబ్ బాషాకు డిప్యూటీ తహశీల్దార్‌గా ప్రమోషన్ కల్పించడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రుద్రవరం తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారన్నారు. ఈ సందర్భంగా ఆర్ఐ నాగేంద్రుడు, సిపిఐ తాలూకా కార్యదర్శి కొమ్ము భాస్కర్, ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, నరసింహులుతో పాటు పలువురు డిప్యూటీ తహశీల్దార్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు.

## గుండెపోటుతో టిడిపి నాయకుడు మృతి

- నివాళ్లుర్పించిన మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని గొడిగనూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రామచంద్రారెడ్డి(58) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమా అఖిలప్రియ గొడిగనూరు గ్రామం చేరుకొని రామచంద్రారెడ్డి మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు. రామచంద్రారెడ్డి మృతి బాధాకరమన్నారు. అలాగే టిడిపి నాయకులు ప్రసాద్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రామసుబ్బయ్య, ప్రమోద్, రామ సుబ్బారెడ్డి, నాగశేషులు సంతాపం తెలిపారు. అలాగే మండలంలోని మద్దూరు గ్రామంలో ఉపాధ్యాయులు సుదర్శన్ రెడ్డి సతీమణి శైలజ(42) గుండెపోటుతో మృతి చెందిన వార్త తెలుసుకున్న మాజీ మంత్రి మద్దూరు గ్రామం వెళ్లి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నాయబ్ మహమ్మద్ జమీల్, నవీద్‌లను అభినందిస్తున్న దృశ్యం

## ఫెన్సింగ్ రాష్ట్ర పోటీల్లో శిరివెళ్ల విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - శిరివెళ్ల**

కాకినాడలో జరిగిన ఫెన్సింగ్ పోటీల్లో శిరివెళ్లకు చెందిన నాయబ్ సలీం కుమారులు మహమ్మద్ జమీల్ బంగారు పతకం, నవీద్ వెండి పతకం సాధించి ప్రతిభ చాటారు. శిరివెళ్లకు చెందిన నాయబ్ సలీం కుమారులు మహమ్మద్ జమీల్, నవీద్‌లు నంద్యాల పట్టణంలోని ఎలైట్ పాఠశాలలో విద్య అభ్యసిస్తున్నారు. కాకినాడలో జరుగుతున్న క్రీడా పోటీల్లో బంగారు పతకంతో జయకేతనం ఎగరవేశారని ఫెన్సింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షులు నాయబ్ ఖలీల్ విలేకరులతో పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో జయకేతనం ఎగరవేసిన విద్యార్థులను జాతీయ జట్టుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి బంగారు పతకాలతో విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం డాక్టర్ మురళి, చైర్మన్ కళ్యాణ్‌తో పాటు ఫెన్సింగ్ హ్యాండ్ సొసైటీ ప్రతినిధులు ప్రత్యేక బహుమతులతో అభినందించి సన్మానించారు.

## ఎలుగుబంటి సంచారం

**ప్రజాశక్తి - పాములపాడు**

పాములపాడు మండలం భానుముక్కల గ్రామ సమీపంలో ఉన్న ఫారెస్ట్‌లో ఎలుగుబంటి సంచరించింది. ఎలుగుబంటి సంచారంతో గ్రామస్తులు, రైతులు పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. పశువుల కాపర్లు, గొర్రెల కాపర్లు ఎలుగుబంటి సంచరిస్తున్న పరిసరాలకు వెళ్లకుండా ఉండాలని ఫారెస్ట్ అధికారులు భానుముక్కల గ్రామంలో గురువారం దండోరా వేయించారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

**ప్రజాశక్తి - నందికొట్కూరు**

గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని బిజినవేముల సర్పంచి రవి యాదవ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని బిజినవేముల గ్రామంలో సర్పంచి ఆధ్వర్యంలో సిసి రోడ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ షాది ఖానా రోడ్డు, సచివాలయం రోడ్డు, ఎస్సీ కాలనీలో స్మశానం రోడ్లు గ్రామంలో ప్రధాన సమస్యగా మారాయని, ఈ సమస్యలను షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సహకారంతో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షమీనా, ఉప సర్పంచ్ అబుబక్కర్, వార్డు మెంబర్ శీను, వైసిపి నాయకులు ఉస్మాన్ భాష, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## హెచ్ఐవిపై అవగాహన కార్యక్రమం

**ప్రజాశక్తి - నందికొట్కూరు**

నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో హెచ్ఐవిపై కళాజాతా బృందాలు అవగాహన కార్యక్రమం సర్పంచి మరియమ్మ సమక్షంలో గురువారం నిర్వహించారు. వీధి నాటకం ద్వారా ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్న చూపు లేకుండా ఎలా సమాజంలో కలిసి జీవించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. క్షయ సుఖ వ్యాధులు, కండోమ్ ఉపయోగాలు వివరించారు. చైల్డ్ ఫండ్ ఇండియా సూపర్వైజర్ మీరం రెడ్డి, కళా జాతా బృందం శంభు ప్రసాద్, పంచాయతీ సెక్రెటరీ సరళమ్మ, ఏఎన్ఎంలు శాంతి, జ్యోతి, ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ రామక్రిష్ణ డిగ్రీ కళాశాలలో మేనేజ్మెంట్ కోటాలో అడ్మిషన్లకు దరఖాస్తులు

**ప్రజాశక్తి - నంద్యాల**

రాష్ట్ర ప్రభుత్వం 2022-23 విద్యా సంవత్సరానికి మేనేజ్మెంట్ కోటాలో అడ్మిషన్స్ పొందుటకు ఈ నెల 8, 9, 10వ తేదిలలో అనుమతించిందని కళాశాల చైర్మెన్ డాక్టర్ జి.రామక్రిష్ణ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులు శ్రీ రామక్రిష్ణ డిగ్రీ కళాశాలకు విచ్చేసి కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని కోరారు. ప్రభుత్వానికి రూ.500 చెల్లించాలని, ఫీజుతో పాటు ఇంటర్ పాస్, స్టడీ, క్యాస్ట్ సర్టిఫికేట్, ఈడబ్ల్యూఎస్‌కు అర్హులైన వారు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేట్ తీసుకురావాలని తెలిపారు. కళాశాల డైరెక్టర్ జి.హేమత్ రెడ్డి, ప్రిన్సిపల్ కెబివి సుబ్బయ్య పాల్గొన్నారు.

## అర్బన్ ఆశా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాల పట్టణంలోని 13వ వార్డ్ అర్బన్ సెక్రటేరియట్ పరిధిలోని ఆశ పోస్టుల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 నుండి 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు https://nandyal.ap.gov.in వెబ్ సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

## గ్రామాల అభివృద్ధికి శిక్షణ తరగతులు

**ప్రజాశక్తి - కొత్తపల్లి**

కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల అభివృద్ధి కోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మేరీ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 13, 14 తేదీలలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల అభివృద్ధి కోసం చేయవలసిన పనులు, 2023-24 సంవత్సరం అభివృద్ధి ప్రణాళిక తయారు చేసేందుకు ప్రతి శాఖ అధికారి రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ముఖ్యంగా మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ఈ శిక్షణ తరగతులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతాయన్నారు.

## అభివృద్ధి ప్రణాళికలో అందరి భాగస్వామ్యం

**ప్రజాశక్తి - అవుకు**

అవుకు పంచాయతీ అభివృద్ధిలో భాగంగా 2023-24 ప్రణాళికలో అందరూ భాగస్వామ్యమై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపిపి చల్ల రాజశేఖర్ రెడ్డి, జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మిలు తెలిపారు. గురువారం అవుకు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిడిఒ అజామ్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ముఖ్య అవసరాలైన రక్షిత మంచినీరు, పారిశుధ్యం, అంతర్గత రహదారులు, వీధి దీపాలు, ప్రాథమిక విద్య, ప్రాథమిక ఆరోగ్యం, పౌష్టిక ఆహారం, వ్యవసాయం, పశుపోషణ, నీటివనరుల సంరక్షణ, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి కార్యాచరణ చేసే విధంగా ప్రతి ఒక్కరు పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వైస్ ఎంపిపి, సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళిక సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, జడ్పిటిసి

# వైసిపిది పిచ్చి తుగ్లక్ పాలన : టిడిపి

**ప్రజాశక్తి - ప్యాపిలి**

రాష్ట్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డి పిచ్చి తుగ్లక్ పరిపాలన చేస్తున్నారని టిడిపి డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి, బిసి సాధికారిత చైర్మన్ నాగేశ్వరావు యాదవ్ పేర్కొన్నారు. గురువారం ప్యాపిలి పట్టణంలోని 9వ వార్డు బిసి కాలనీలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మూడేళ్లలో ఏడుసార్లు కరెంటు చార్జీలు పెంచి ప్రజల నుండి 20 వేల కోట్లు దండుకుందని అన్నారు. గత టిడిపి హయాంలో అన్నాక్యాంటీన్, ఆదరణ పథకం, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక లాంటివి పేద ప్రజలకు ఉపయోగపడే పథకాలను నేడు పూర్తిగా తొలగించడం వైసిపి ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనం అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో డోన్ నియోజకవర్గంలో టిడిపిని గెలిపించుకోవాలని, నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో గౌతమ్ రెడ్డి, ప్యాపిలి మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, బిసి సెల్ జిల్లా అధికార ప్రతినిధి రామమోహన్ యాదవ్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు నాగేంద్ర, ఎర్రగుంట్లపల్లె వెంకటేశ్వర రెడ్డి, ప్యాపిలి పట్టణ అధ్యక్షులు సుంకయ్య, తెలుగుయువత అధికార ప్రతినిధి బోరెడ్డి అభిలాష్ రెడ్డి, గండికోట పెద్ద రామాంజనేయులు, పోతుదొడ్డి పుల్లారెడ్డి, ఆలేని.నాగరాజు, మౌలాలిరెడ్డి, బాలరంగస్వామి, ఆర్.మల్లికార్జున, రాములన్న తదితరులు పాల్గొన్నారు. **డోన్ :** రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంలో ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని టిడిపి డోన్ పట్టణ అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని 23వ వార్డులో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రజలు ఉపాధి కోల్పోయారని, రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నంద్యాల జిల్లా బిసి సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లిఖార్జున, పట్టణ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నీలం ప్రభాకర్, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కేబుల్ కిరణ్, ఉంగరాన్నిగుండ్ల మెట్ట మద్దయ్య, గుండాల నారాయణ స్వామి, గుండాల జగన్, గుండాల జయవర్ధన్, కేబుల్ మురళీ, సతీష్ కుమార్, నిషార్, అరుణ్, ప్రవీణ్, క్రిష్ణ యాదవ్, షఫీ, అంపయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న టిడిపి డోన్ నియోజకవర్గ అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజలకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్న టిడిపి పట్టణ అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు

'ఇదేమి కర్మ రాష్ట్రానికి' పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బిసి

## ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం : మాజీ ఎమ్మెల్యే బిసి

**బనగానపల్లె :** వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఇదేం కర్మ అనే కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్ళనున్నట్లు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి, టిడిపి నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ నుండి గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, మిట్టపల్లె సర్పంచ్ తులసి రెడ్డి, వార్డు మెంబర్ లాయర్ నాగేంద్ర రెడ్డి, నాయకులు తప్పెట నాగేశ్వరరెడ్డి, బొబ్బల రామ మద్దిలేటి రెడ్డి, కైపా రఘునాథరెడ్డి, కటికెవానికుంట బాలరాజు యాదవ్, పర్లపాటి చంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్యాపిలి తహశీల్దారుగా చంద్రశేఖర్ వర్మ

**ప్యాపలి :** ప్యాపిలి నూతన తహశీల్దార్‌గా చంద్రశేఖర్ వర్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కౌతాళం మండలం నుంచి బదిలీపై ప్యాపిలికి వచ్చారు. ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

## వివాహ వేడుకల్లో శాప్ చైర్మన్

**ప్రజాశక్తి - నందికొట్కూరు**

నందికొట్కూరు పట్టణంలోని మిడుతూరు రోడ్డులో ఉన్న ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన 10.బొల్లవరం గ్రామానికి చెందిన మేకల ఈశ్వరయ్య యాదవ్ కుమారుడి వివాహ వేడుకల్లో వైసిపి యువజన విభాగం అధ్యక్షులు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు. నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురేష్ యాదవ్, వీఆర్వో శ్రీనివాసులు, వీఆర్ఏ వాసుదేవ్ పాల్గొన్నారు.

## నాడు-నేడు పనులకు భూమి పూజ

**రుద్రవరం :** రుద్రవరం గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచి బైరి విజయలక్ష్మి, వైసిపి నాయకుడు బైరి బ్రహ్మం పర్యవేక్షణలో స్థానిక ఎంపీపీఎస్, స్పెషల్ పాఠశాలలో నాడు-నేడు అభివృద్ధి పనులకు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకుడు బైరి బ్రహ్మం మాట్లాడుతూ పాఠశాలకు నాడు-నేడు కింద రూ.16 లక్షల నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ నిధులతో పాఠశాల మరుగుదొడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మొబ్బు బాలస్వామి, పాఠశాల హెచ్ఎం సుభాన్, ఇంజనీర్ అసిస్టెంట్ ఎం.అవినాష్, ఎన్.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు

# దళిత కాలనీలో మౌలిక వసతులను కల్పించాలి : కెవిపిఎస్

**ప్రజాశక్తి - అవుకు**

దళితుల కాలనీల్లో మౌలిక వసతులను కల్పించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామదాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అవుకు పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తుందన్నారు. దళితుల కాలనీలో దేవాలయాలను నిర్మించేందుకు ముందుకు రావడం ఇందుకు నిదర్శనమని చెప్పవచ్చన్నారు. ఇప్పటికే దళితుల కాలనీలో దేవాలయాలు, చర్చిలు ఉన్నాయని, కొత్తగా వీటిని నిర్మించటం వల్ల ఏమీ ఉపయోగం లేదన్నారు. కాలనీలో ఇంకా మతవిద్వేషాలు పెరుగుతాయని అన్నారు. ప్రస్తుతం ఉన్న దేవాలయాల్లోనే దళితులకు ప్రవేశాలు కల్పిస్తే సరిపోతుందని తెలిపారు. స్మశాన వాటికలు లేక దళితులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా దళిత కాలనీలో దేవాలయ కట్టడాలను విరమించి మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాములు, శ్రీదేవి, బేగరీల సంఘం మండల అధ్యక్షుడు కంబయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామదాసు

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

**- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్**

**ప్రజాశక్తి - డోన్**

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించడమే వైసిపి లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. గురువారం డోన్ పట్టణంలోని మూడవ సచివాలయ పరిధిలో 3, 4వ వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. వార్డులలో ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే కౌన్సిలర్ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు హరికిషన్, జాకిర్ హుస్సేన్, కౌన్సిలర్లు చలం వెంకటేశ్వరమ్మ, బద్దల సుబ్బలక్ష్మి, టిఇ.దినేష్ గౌడ్, నాగేంద్ర, మహేశ్వర్ రెడ్డి, వెంకటరాముడు, కళావతి, దారా హరినాథ్ రెడ్డి, నాయకులు రఘురామయ్య, కుళ్లాయప్ప, అశోక్, హౌసింగ్ ఏఈ వీరేంద్ర, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

# రోడ్డు ప్రమాదంలో సినీ రచయితకు తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

ఆళ్లగడ్డలోని జాతీయ రహదారిలోని కోటకందుకూరు మెట్ట వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ సినీ రచయిత రాజసింహకు తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరు గాయపడ్డారు. వివరాలు.. హైదరాబాద్ బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన సినీ రచయిత, డైరెక్టర్ రాజసింహ హైదరాబాద్ నుంచి తిరుపతికి కారులో వెళుతుండగా కోటకందుకూరు సమీపంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం తప్పించబోయి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాజసింహ ఎడమ కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో కొంత మందికి గాయాలయ్యాయి. విషయం తెలిసిన గ్రామీణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాజసింహతోపాటు గాయపడిన వారిని 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజసింహకు మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. రాజసింహ బావగారు బాగున్నారా, సరైనోడు, రుద్రమదేవితో పాటు మరో 60 సినిమాలకు రచయితగా పని చేశారు. ఒక అమ్మాయి తప్ప సినిమాకు డైరెక్టర్‌గా పని చేశారు.

గాయపడిన సినీ రచయిత, మరో మహిళ

# భూ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోండి

**- సిసిఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం (సమగ్ర సర్వే) కింద రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో భూ హక్కు పత్రాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని సిసిఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయం నుండి సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం (సమగ్ర సర్వే) కార్యాచరణ, అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రీసర్వే పనులను వాయిదా వేయకుండా త్వరగా పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. రీ సర్వేలో తలెత్తిన సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. ఫైనల్ ఆర్ఓఆర్‌లో పొరపాట్లు దొర్లితే సవరించుకునేందుకు అవకాశం ఉంటుందని భూ యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించి భూ సమస్యలకు పూర్తిస్థాయి పరిష్కార మార్గాలు చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చేపట్టిన సర్వే వివరాలు రికార్డుల్లో పొందుపరిచి భద్రపరచాలన్నారు. రీ సర్వే అనంతరం కొలత రాళ్ల పని పూర్తి చేయాలని సూచించారు. మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఎలకు వెళ్లకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ తదితర క్షేత్రస్థాయి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఇర్ఫాన్‌ను అభినందిస్తున్న కళాశాల ఉపాధ్యాయ బృందం

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఇర్ఫాన్ ఎంపిక

**ఆత్మకూర్ :** మండలంలోని ఉరుకుంద గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి ఇర్ఫాన్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం మహేశ్వరి విద్యార్థి ఇర్ఫాన్‌ను అభినందించి మాట్లాడారు. శ్రీశైలం నియోజవర్గం నుండి తమ పాఠశాలలో చదువుతున్న ఇర్ఫాన్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయం అన్నారు. గ్రామీణ ప్రాంతం నుండి రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లే విద్యార్థులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్, విద్యార్థులు ఇర్ఫాన్‌ను అభినందించారు.

# మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

**ప్రజాశక్తి - చాగలమర్రి**

ప్రభుత్వ మద్యం దుకాణాలలో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని నంద్యాల జిల్లా ఎక్సైజ్ సూపరెంటెండెంట్ రవికుమార్ రెడ్డి హెచ్చరించారు. చాగలమర్రి పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. మద్యం దుకాణాల్లోని స్టాకు, రికార్డులను పరిశీలించారు. మద్యం కొనుగోలు దారులతో మద్యం దుకాణాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా..?, అధిక ధరలకు విక్రయిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుకాణాల వద్ద అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవన్నారు. నంద్యాల జిల్లాలో 74 , నందికొట్కూరు, ప్యాపిలి, డోన్లలో 18, కర్నూలు కార్పొరేషన్లో 14 మద్యం డిపోలు ఉన్నాయన్నారు. నిర్ణీత వేళలు పాటించి మద్యం విక్రయించాలన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్సై అస్లాంబాషా, సిబ్బంది నాగరాజు, ఆంజనేయులు, విజయ్ చంద్ర ఉన్నారు.

మద్యం దుకాణం తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సూపరిండెంట్ రవికుమార్ రెడ్డి

## గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

**బనగానపల్లె :** గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సిడిపిఓ ఉమా మహేశ్వరమ్మ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పసుపల ఒకటవ అంగన్వాడి కేంద్రాన్ని సిడిపిఒ ఉమామహేశ్వరమ్మ, సూపర్వైజర్ చిట్టెమ్మలు పరిశీలించారు. పిల్లలు ఎత్తుకు తగిన బరువు ఉన్నారో లేదో తూకం వేసి పరిశీలించారు. అంగన్వాడీ వర్కర్ రోజా రమణి, ఎంఎల్‌హెచ్‌పి జయమ్మ, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

# ప్రత్యేక పాఠశాలను సందర్శించిన అధికారులు

**ప్రజాశక్తి - పగిడ్యాల**

మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలోని ప్రత్యేక ఎంపిపి పాఠశాలను ఎంపిడిఒ వెంకటరమణ, ఇఒఆర్‌డి పుల్లయ్య, పంచాయితీ ఎఇ వెంకటేశ్వర్లు గురువారం సందర్శించారు. నాడు-నేడు కింద పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి అడ్డంకులున్నాయని పాఠశాల హెచ్ఎం శివకుమార్‌రాజు ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు పాఠశాలకు వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. అధికారులు గ్రామస్తులకు నచ్చచెప్పి ప్రహరీగోడ నిర్మాణానం చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. నేటి నుండి నిర్మాణ పనులు చేపట్టాలని హెచ్ఎంను ఆదేశించారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

## కోట్లవారి పల్లెలో అక్రమాలు అరికట్టి బడి కట్టాలి

**డోన్ :** కోట్లవారి పల్లెలో అక్రమాలు అరికట్టి బడి కట్టాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగనాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూగత 20 సంవత్సరాల క్రితం కోట్లవారి పల్లెలో 250 కుటుంబాలు నివాసం ఉంటుంటాయని తెలిపారు. స్కూలు స్థలాన్ని అక్రమార్కుల చెర నుండి విడిపించి బడి ఏర్పాటు చేయాలని కోరారు. ఐఎఫ్‌టియు నాయకులు మల్లికార్జున, రామాంజనేయులు, కోట్లవారి పల్లె మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు

**బనగానపల్లె :** మండలంలోని బీరవోలు గ్రామంలో కాశిరెడ్డి నాయన 11వ ఆరాధన ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి ఆరాధన ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, గురెడ్డి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గుండం నాగేశ్వర రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, గురువయ్య, రాంబాబు, ఎస్సీ యూత్ బీరువోలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కాశిరెడ్డి నాయన విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

**ప్రజాశక్తి - పాములపాడు**

మహిళలు స్వయం ఉపాధితో తమ కుటుంబ ఆర్థిక అభివృద్ధిని మెరుగుపరుచుకోవచ్చని సేవా భారతి అధ్యక్షులు షర్ఫుద్దీన్ అలీ పేర్కొన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడిన మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ, వైరు బుట్టల అల్లకం, ఎంబ్రాయిడింగ్ వంటి ఉపాధి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల మహిళలు తమ బయోడేటాతో పాటు ఆధార్, రేషన్ జిరాక్స్, రెండు పాస్ ఫోటోలు ఇవ్వాలన్నారు. ఈ నెల నుండి 2023 మార్చి వరకు శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ శిక్షణ నెహ్రు యువ కేంద్రం వారి సహకారంతో సేవా భారతి యూత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9573318022, 8247725579 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## లింగ వివక్షపై పోరాటం చేయాలి : సిడిపిఒ

**ప్రజాశక్తి - బండి ఆత్మకూర్**

సమాజంలో లింగ వివక్ష, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు మొదలగు సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు కలిసికట్టుగా పోరాటం చేయాలని సిడిపిఒ ఉషారాణి తెలిపారు. గురువారం బండి ఆత్మకూరు మండలంలోని ప్రభాత్ విద్యాసంస్థల సమావేశపు భవనంలో జరిగిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని బాల్యవివాహాలు, లింగ వివక్ష, సైబర్ నేరాలు తదితర సమస్యలపైన ప్రజల్లో అవగాహన కలిగించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రభాత్ విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు అధికం అయ్యాయని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు శోభారాణి, విజయలక్ష్మి, పద్మావతి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళిక సమావేశంలో

## వరిలో పంట కోత ప్రయోగం

**శిరివెళ్ల :** శిరివెళ్ల మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం-4 పరిధిలో ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజనకి సంబంధించి వరిలో పంట కోత ప్రయోగం గురువారం నిర్వహించారు. 5-5 మీటర్లలో వరి పంటను (ఎన్‌డిఎల్ఆర్-7) కోసి దిగుబడి అంచనా వేయగా 18.540 కేజీలు వచ్చింది. ఎకరాకు బస్తాకు 75 కేజీల ప్రకారం 40 బస్తాల దిగుబడి రావచ్చని అంచనా వేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈ.సుధాకర్, వ్యవసాయ విస్తరణ అధికారి యస్. శ్రీనివాసు, ఎంపిఇఒ బి.సుమలత, తలారీలు, రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా దత్తాత్రేయ జయంతి

**బేతంచెర్ల :** బేతంచర్ల-కర్నూలు రోడ్డు రహదారిలో వెలసిన షిరిడి సాయిబాబా ఆలయంలో దత్తాత్రేయ స్వామి వేడుకలు గురువారం భక్తులు ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు శిరిడి సాయిబాబా, దత్తాత్రేయ స్వామికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి, కాకడ హారతి నిర్వహించారు. ఆలయ భక్తులు గుండా గోపాల్, మల్లికార్జున, నారాయణ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పూజలు నిర్వహిస్తున్న భక్తులు